సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 27 । ఫిబ్రవరి । 2025



సోమశిలలో 59.826 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారానికి 59.826 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 792 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 3,138 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.88,940
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,036
3 శాతం జీఎస్టీతో	రూ.8,277
నవర (8 గ్రా)	రూ.66,216

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.6 /24.3

జిల్లాలో గురువారం వాతావరణం పొడిగా, ఎండ తీవ్రత పెరుగుతుందని ఆశాఖాధికారులు తెలిపారు. బుధవారం గాలిలో తేమ 63 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

నిబంధనల మేరకే విధులు

- నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో తనతోపాటు టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇతర విభాగాల అధికారులందరూ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే విధులు నిర్వహిస్తున్నామని కమిషనర్ సూర్యతేజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులందరూ తమకు అన్ని విధాలా సహకరిస్తున్నారని పేర్కొన్నారు. తామెవరూ బదిలీలు కావాలని కోరుకోవడం లేదని, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లోనే పని చేయాలని కోరుకుంటున్నామన్నారు. నెల్లూరు నగరాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని పరిపాలన కొనసాగిస్తున్నామని, తమపై ఎవరి వల్ల ఎలాంటి ఒత్తిడి లేదని సూర్యతేజ స్పష్టం చేశారు.

రేపు జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు

నెల్లూరు (టౌన్): జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 28న స్థానిక దర్గామిట్టలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారున. '2025 థీమ్ అభివృద్ధి చెందిన భారతదేశం కోసం సైన్స్ ఆవిష్కరణలో ప్రపంచ నాయకత్వం కోసం భారతీయ యువతకు సాధికారత కల్పించడం' అనే అంశంపై ప్రాథమిక విద్య 3 నుంచి 8వ తరగతి వరకు, సెకండరీ విద్య 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లతోపాటు బహుమతి ప్రదానం చేస్తామన్నారు.

గండిపాళెం ఘటనపై బాలల హక్కుల కమిషన్ సీరియస్

సాక్షి ఎఫెక్ట్..

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాలలో విద్యార్థులతో పనులు చేయిస్తున్న విషయం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సీరియస్ అయింది. 'విద్యార్థులతో వంట పనులు' శీర్షిక ఈ నెల 24వ తేదీ సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో వివరణ ఇవ్వాలని కమిషనర్ పద్మావతి జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. పిల్లలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరమైనందున, ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకునే అవకాశముంది. విద్యార్థులకు వంట చేసేందుకు ఇద్దరు కుక్‌లు, మరో ఇద్దరు సహాయకులు ఉన్నారు. కానీ వీరు కొన్ని పనులను విద్యార్థులతో చేయిస్తున్నారు. ప్రతి రోజు వంట పనులతో పాటు ఇతర పనులు చేసేందుకు విద్యార్థులను బ్యాచ్‌లుగా విభజించారు. ప్రతి బ్యాచ్‌లో 15 మంది ఉంటారు. వీరు రోటేషన్ పద్ధతిలో వంట పనులు చేస్తున్న పరిస్థితి.

3 నుంచి ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలు

నెల్లూరు (టౌన్): ఏపీ ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలకు వచ్చే నెల 3వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరగనున్నట్లు డీఈఓ బాలాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు సంబంధించి అభ్యాసకులు హాల్ టికెట్లను సంబంధిత స్టడీ సెంటర్లలో పొందాలన్నారు.

నేడు రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు

కొనకనమిట్ల: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం మండలంలోని వాగుమడుగు పంచాయతీ అంబాపురంలో రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. అంబాపురంలోని అంబబాల సంగేశ్వరస్వామి ఆలయం ఆవరణలో పాలపళ్ల విభాగం నుంచి ఆరుపళ్ల సైజు వరకు (12 క్వింటాళ్ల బండ) ఎడ్ల పోటీలు నిర్వహిస్తారు. మొత్తం 10 జతల ఎడ్లు పోటీల్లో పాల్గొంటున్నాయని, గెలుపొందిన ఎడ్లకు మొదటి, రెండు, మూడు బహుమతులు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు దాతల సహకారంలో ఇస్తున్నట్లు చెప్పారు. శివాలయం వద్ద భక్తులకు అన్నదానం, రాత్రికి విద్యుత్ ప్రభ ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఎడ్ల పందేలకు వచ్చే వారు వివరాలకు 8790612406, 9704364204 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

పక్షుల కేంద్రంలో రైల్వే డీఆర్‌ఎం

దొరవారిసత్రం: మండలంలోని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని బుధవారం విజయవాడ డివిజన్ డీఆర్‌ఎం నరేంద్ర ఎ.పాటిల్ సందర్శించారు. కడప చెట్లపై విడిది చేసిన విహంగాల విన్యాసాలను కెమెరాతో చిత్రీకరించారు. ఈ సందర్భంగా నేచర్ గైడ్ హుస్సేనయ్య పక్షుల జీవన విధానాలను వివరించారు.



నెల్లూరులోని మూలపేటలో కొలువైన ముక్కంటిని దర్శించుకుంటున్న భక్తులు



ఇందుకూరుపేట: మైపాడు సముద్ర తీరంలో కొలువైన శివాలయంలో భారీ శివలింగానికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

ప్రణవుడికి.. ప్రణమిల్లి..

కైవల్య నాథుడికి విశేష కైంకర్యాలు

- ముకుళిత కరాలతో ముక్తిప్రదాతకు ప్రణమామ్యహం
- భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి
- కిటకిటలాడిన కైలాసనాథుడి కొలువులు



వెండినందిపై మల్లికార్జునస్వామి, కామాక్షితాయి

శివశివ శంకర.. భవహర.. కైలాసపురి దేవరా.. హరహరా.. నీలకంఠేశ్వరా.. అఖండ తేజోమయ.. లోకేశ్వరా.. రుద్రాయ భద్రాయ.. భూతనాథయ.. ఓం నమశ్శివాయ.. అంటూ శివనామస్మరణలతో శైవక్షేత్రాలు మార్మోగిపోయాయి. కైలాశాధిపతి, ఓంకారుడు, ప్రణవుడు, గరళకంఠుడు, సర్వేశ్వరుడు సకల నామరూపధారుడు పరమశివుడికి ప్రీతికరమైన మహాశివరాత్రి సందర్భంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా ఆది దంపతులు కొలువైన శైవక్షేత్రాల్లో వేకువజాము నుంచే మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అర్ధరాత్రి లింగోద్భవాభిషేకం, విశేష పూజలు చేశారు. క్షేత్రాల్లో దీపాలు వెలగించి ఆరాదించారు. ప్రణవుడికి ప్రణమిల్లి ప్రార్థించారు. ముక్తిప్రదాతను ముకుళిత కరాలతో ప్రణమామ్యహం అంటూ మొకరిల్లారు. ఉమామహేశ్వరుల నిలయాలు వేకువజాము నుంచి కిటకిటలాడాయి. త్రినేత్రుడిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ముక్కంటి విశేషాలంకారంలో భక్తులకు నేత్రపర్వంగా దర్శనమిచ్చారు. సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించారు. భక్త వల్లభుడు ముక్కంటేశ్వరుడి ఆలయాల్లో కోలాహలం నెలకొంది. – సాక్షి, నెట్‌వర్క్



గణేష్ ఘాట్‌లోని స్వర్ణలింగేశ్వరాలయంలో..



మూలపేట శివాలయంలో భక్తులు రద్దీ



సీతారామపురం: భక్తులతో కిటకిటలాడుతున్న భైరవకోన



ఆత్మకూరు: శివాలయంలో పార్వతి, పరమేశ్వరుల కల్యాణం



టీపీగూడూరు: కాటేపల్లి శివాలయంలో దీపాలు వెలిగిస్తూ..

గిరిజన బాలికను గర్భవతిని చేసి మోసం



కావలి: మండలంలోని ఒక గ్రామానికి చెందిన గిరిజన బాలికను ఓ వ్యక్తి గర్భవతి చేసినట్లు బుధవారం కావలిరూరల్ పోలీసులకు ఫిర్యాదు అందింది. బాలికకు రుతుస్రావం ఆగిపోవడంతో కుటుంబ సభ్యులు పట్టణంలోని వైద్యశాలకు తీసుకొచ్చి పరీక్షలు చేయించారు. బాలిక గర్భం దాల్చినట్లు వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోయారు. ఇంటికి తీసుకెళ్లి బాలికను కుటుంబ సభ్యులు విచారించగా గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ చదివిన వ్యక్తి మాయమాటలు చెప్పి శారీరకంగా కలిసినట్లు వెల్లడించింది. దీంతో వారు కావలిరూరల్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు అందజేశారు. అయితే బాధితురాలి కుటుంబ సభ్యులను రెండు రోజుల తర్వాత పోలీస్‌స్టేషన్‌కు రావాలని పోలీసులు పంపించేశారు. అయితే ఈ వ్యవహారంపై రాజకీయ ఒత్తిళ్లు ఉన్నట్లు తెలుస్తోంది.

గర్భిణిపై టీడీపీ నేత అమానుషం

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని చెల్లాయపాళెంలో నిండు గర్భిణిపై తన సొంత పెదనాన్న, టీడీపీ నేత అమానుషంగా దాడి చేసిన ఘటన బుధవారం జరిగింది. ఆ గర్భిణి బాధతో విలవిలలాడుతూ పోలీసులకు ఫోన్ చేసినా ఎలాంటి స్పందన రాలేదు. దీంతో తన భర్త సహకారంతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి అర్ధ గంటసేపు బాధతో విలవిలలాడుతూ కూర్చున్నా.. పోలీసులు పట్టించుకోకపోవడం తీవ్ర చర్చకు దారి తీసింది. వివరాల్లోకి వెళితే.. చెల్లాయపాళెంకు చెందిన టీడీపీ నేత తమ్మిరెడ్డి మల్లికార్జున్ సోదరుడు చనిపోవడంతో అతని భార్య, బిడ్డలతో పొలం వివాదం ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం తమ్ముడి భార్య, రెండో కుమార్తెతోపాటు మరికొందరిపై దౌర్జన్యం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తన పుట్టింట్లో ఉన్న తమ్మిరెడ్డి శరణ్య బుధవారం మందులు తెచ్చుకునేందుకు బుచ్చిరెడ్డిపాళెం బయలుదేరింది. ఆమెను చూసిన పెదనాన్న మల్లికార్జున్, నానమ్మ అడ్డగించారు. శరణ్య నిండు గర్భిణి అని తెలిసి కూడా ఆమె కడుపుపై విచక్షణా రహితంగా కాళ్లతో తన్నుతూ, కర్రలతో కొట్టారు. దీంతో బాధితురాలు అక్కడి నుంచి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసినా స్పందించలేదు. శరణ్య బాధతో రోదించి పోలీస్‌స్టేషన్ వద్దే స్పృహ తప్పి పడిపోయింది. దీంతో ఆమె భర్త హరికిరణ్ స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పుడొచ్చిన పోలీసులు నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించేందుకు ప్రయత్నించగా తాము చికిత్స పొందుతున్న వైద్యశాలకు వెళ్తామని శరణ్య, ఆమె భర్త చెప్పడంతో అక్కడికి తరలించారు. టీడీపీ నేతల దురాగతానికి, మహిళపై దాడి చేసినా తొలుత పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం అంశాలు దిగ్భ్రాంతి కలిగిస్తోంది.



ప్రభుత్వ వైద్యశాలలో తన బాధను వెల్లడిస్తున్న బాధితురాలు శరణ్య

కప్పం కడితే సక్రమం.. లేదంటే అక్రమం

- పాత లేఅవుట్ల యజమానులకు షాడో ఎమ్మెల్యే హుకుం
- రూ.10 లక్షలు కట్టి రసీదు తీసుకోమంటున్న తమ్ముళ్లు
- గతంలోనే అన్ని అనుమతులు తీసుకుని ప్లాట్లు వేసిన యజమానులు
- వీరి తీరుతో రియల్ ఎస్టేట్ ఢమాల్

కోవూరు నియోజకవర్గంలో తమ్ముళ్ల దోపిడీకి, దాష్టీకాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఒక్కో వ్యాపారానికి ఒక్కో మాఫియా తయారైంది. ఇసుక, కోళ్ల వ్యర్థాలు, రేషన్ బియ్యం అక్రమ రవాణా, పేకాట, మద్యం వంటి అసాంఘిక కార్యకలాపాలతో చెలరేగిపోతున్న తమ్ముళ్లు చివరకు పశువుల వ్యాపారంతో అక్రమార్జనకు పాల్పడుతున్నారు. తాజాగా రియల్ వెంచర్లపై పడి దోచుకునేందుకు సిద్ధమయ్యారు. గత ప్రభుత్వ హయాంలో అన్నీ అనుమతులతో ఏర్పాటు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న వెంచర్ల యజమానులను వాటాలివ్వాలంటూ బెదిరింపులకు దిగుతున్నారు.



కోవూరులో అన్ని అనుమతులతో ఏర్పాటు చేసిన లేఅవుట్

కోవూరు: ధనార్జనే ధ్యేయంగా టీడీపీ నేతలు, షాడో ఎమ్మెల్యేలు బరి తెగిస్తున్నారు. కప్పం కడితే సక్రమం లేదంటే.. అక్రమం చేస్తామని బెదిరిస్తున్నారు. ప్రతి వ్యాపారాన్ని మాఫియాగా మార్చుకుని అక్రమ దందాలకు పాల్పడుతున్నారు. సహజ వనరుల నుంచి అసహజ వ్యాపారాల మాఫియాలకు అండగా ఉంటూ దోచుకుతుంటున్న తమ్ముళ్లు తాజాగా రియల్ వెంచర్లపై కన్నేశారు. పాత వెంచర్లకు నోటీసులు పేరుతో రూ.లక్షల్లో వసూళ్లకు తెర తీస్తున్నారు. గతంలో అనుమతులు పొంది ప్లాట్లు విక్రయించుకున్న యజమానులకు షాడోలు ఫోన్లు చేసి బెంబేలెత్తిస్తున్నారు. ఇప్పటికే ఆయా వెంచర్లలో ప్లాట్ల కొనుగోలు చేసిన యజమానులు గృహాలు నిర్మించుకుని నివాసాలు ఉంటున్నారు. వారికి సైతం నోటీసులు జారీ చేయించి నరకం చూపిస్తున్నారు.

రూ.కోట్ల దండుకునే కుట్ర..

కోవూరు పంచాయతీ పరిధి శివారు ప్రాంతాల్లో గత ప్రభుత్వంలో దాదాపు 10 వెంచర్లు పంచాయతీ అనుమతులతో లేఅవుట్లు ఏర్పాటు చేశారు. ఆ మేరకు డీటీసీపీ అనుమతులు కూడా తీసుకున్నారు. ఇప్పటికే ఆయా లేఅవుట్లలో గృహాల నిర్మాణాలు కూడా జరుగుతున్నాయి. తాజాగా ఆయా వెంచర్లకు అనుమతులు లేవంటూ పంచాయతీ అధికారులు నోటీసులు ఇస్తున్నారు. తాజా పరిణామాలతో గృహ నిర్మాణదారులు భయపడుతున్నారు. రూ.లక్షలు వెచ్చించి ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకుంటే ఇప్పుడు అనుమతుల పేరిట ఇబ్బందులు పెడుతున్నారని ఆందోళన చెందుతున్నారు. ఆయా వెంచర్ల యజమానులతోపాటు ప్లాట్ల యజమానులను బెదిరించి రూ.కోట్ల దండుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.

రద్దు చేయిస్తామంటే... అనుమతులున్నట్లే కదా

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టీడీపీ నేతలు దండుకోవడమే పరమావధిగా పెట్టుకుని దోచుకుంటున్నారు. గతంలోనే ఏర్పాటు చేసిన లేఅవుట్లకు రూ.10 లక్షల ముడుపులుగా ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేస్తుంటే, అంతే మొత్తం మాకు ఇవ్వాలంటూ పంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లా పంచాయతీ అధికారి వరకు డిమాండ్ చేస్తున్నారని, లేదంటే అనుమతులు రద్దు చేస్తామని బెదిరిస్తున్నారని, అన్ని నిబంధనల ప్రకారమే డబ్బులు చెల్లించామని, మళ్లీ ఇప్పుడు ఇవ్వాలంటే ఎలా అని యజమానులు వాపోతున్నారు. పంచాయతీ అనుమతులు రద్దు చేయిస్తామంటే వాటికి అనుమతులు ఉన్నట్లే కదా? మేమెక్కడ అక్రమంగా లేఅవుట్లు వేశామంటూ వెంచర్ల యజమానులు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉంటే పంచాయతీ అధికారుల దోపిడీ మామూలుగా లేదు. డీటీసీపీ అనుమతులు లేవంటూ అందుకు మరో రూ.5 లక్షల ఇవ్వాలంటూ పంచాయతీ కార్యదర్శి ఓపెన్‌గానే డిమాండ్ చేయడం గమనార్హం. ఈ విధంగా టీడీపీ నేతలు, పంచాయతీ అధికారులు ఎడాపెడా దోపిడీతో రియల్ వెంచర్ల యజమానులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇక ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు కూడా ప్రస్తుతం ఇల్లు కట్టలేమంటూ వాయిదా వేసుకుంటున్నారు.

లోకాయుక్తకు ఫిర్యాదు చేయించి

కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ పార్టీ నేతలు వెంచర్లపై కన్నేశారు. యజమానులను బెదిరించి ప్రతి లేఅవుట్‌కు అడిగినంత ఇవ్వాలని లేదంటే ఆయా లేఅవుట్ల అనమతులు రద్దు చేస్తామంటూ బెదిరిస్తున్నారు. వెంచర్ల యజమానులు సమాధానం చెప్పకపోవడంతో నాయకులు తమకు అనుకూలంగా ఉండే హైదరాబాద్‌లో ఉంటున్న వ్యక్తితో లోకాయుక్తలో ఫిర్యాదు చేయించారు. విచారించి నివేదిక ఇవ్వాలనే లోకాయుక్త ఆదేశాలను పట్టుకుని నాయకుల నుంచి అధికారుల వరకు ఒక్కో లేఅవుట్‌కు రూ.10 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారు. ఆయా లేఅవుట్లలో కొనుగోలు చేసిన స్థలాల్లో ఇల్లు నిర్మించుకుందామంటే అనుమతులకు టీడీపీ నేతల నుంచి అధికారుల వరకు అన్ని స్థాయిల్లో పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నారు. ఈ పరిణామాలతో ఎవరైనా కొత్తగా ప్లాట్లు కొనుగోలు చేయాలంటే ఆలోచిస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో ప్లాట్లు కొనేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. వెంచర్లలో ప్లాట్లు అమ్ముకోలేక పెట్టుబడులు వడ్డీలు రాక యజమానులు అప్పుల పాలవుతున్నారు.

నిబంధనల ప్రకారమే లేఅవుట్లు

కోవూరు పంచాయతీ పరిధిలో వేసిన లేఅవుట్లను నిబంధనల ప్రకారమే ఏర్పాటు చేశారు. నుడా నిబంధనల ప్రకారమే రోడ్లు, ప్రజాప్రయోజనాల అవసరార్థం స్థలాల కేటాయింపు ఆయా లేఅవుట్లలో జరిగాయి. దీనికంటే ముందు వ్యవసాయ భూములను కమర్షియల్ భూములుగా కన్వెర్షన్ ప్రక్రియ కూడా సక్రమంగా జరిగింది. అందుకు సంబంధించి ప్రభుత్వానికి చెల్లించాల్సిన చార్జీలను యజమానులు చెల్లించారు. ఇక లేఅవుట్ల ఏర్పాటుకు సంబంధించి కూడా పంచాయతీకి చెల్లించాల్సిన బెటర్‌మెంట్ చార్జీలను కూడా చెల్లించారు.



నూతన లే అవుట్‌లో నిర్మిస్తున్న రోడ్డు

వామ్మో.. ఎండలు

జిల్లాలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ఫిబ్రవరి ముగియకముందే పరిస్థితి ఈ విధంగా ఉంటే రానున్న నెలల్లో పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని జనం ఆందోళన చెందుతున్నారు. భానుడి ప్రతాపానికి తాళలేక అనేకమంది గొడుగులను ఆశ్రయిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



హరనాథపురం వద్ద గొడుగు నీడలో విశ్రాంతి తీసుకుంటున్న మహిళ



చిన్నారిపై టవల్ కప్పి..



అట్ట అడ్డం పెట్టుకుని..





నెల్లూరు మెడికల్ కాలేజీలో గొడుగులు వేసుకుని వెళ్తున్న విద్యార్థినులు

క్లుప్తంగా

రైల్లో వెళ్తూ.. పెన్నానదిలో పడి..

• గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైమ్): కావలి వైపు వెళ్లే రైల్లో నుంచి పెన్నానదిలో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం నెల్లూరులో పెన్నా బ్రిడ్జి వద్ద జరిగింది. మృతుడి వయసు సుమారు 30 నుంచి 35 ఏళ్ల లోపు ఉంటుందని భావిస్తున్నారు. క్రీమ్ కలర్ ఫుల్ హ్యాండ్స్ చొక్కా, నలుపు రంగు నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై జి.మాలకొండయ్య ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో నదిలో నుంచి మృతదేహాన్ని వెలికితీసి జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు హారం బహూకరణ



హారాన్ని అందజేస్తున్న దాతలు

రాపూరు: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో ఉన్న ఆదిలక్ష్మీదేవికి బుధవారం బంగారు కాసులహారాన్ని దాతలు బహూకరించినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం లింగాలవలస గ్రామానికి చెందిన గురుబెల్లి లక్ష్మీనారాయణ, చైతన్యలు 39 గ్రాముల బంగారు లక్ష్మీదేవి కాసులహారాన్ని అర్చకులు బాలాజీ స్వామికి అందించారన్నారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు, ఆలయ సిబ్బంది వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

సైబర్ నేరంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తి క్రెడిట్ కార్డు కోసం ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయగానే అతని బ్యాంక్ ఖాతాలోని రూ.3.17 లక్షల నగదును సైబర్ నేరగాళ్లు దోచేసిన ఘటనపై నెల్లూరు దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన డేవిడ్ పీటర్ ముత్తుకూరులోని ఓ పవర్ ప్లాంట్‌లో పనిచేస్తూ నెల్లూరు ఇస్కాన్ సిటీలోని శ్రీనివాస్ అపార్ట్‌మెంట్ పెంట్‌హౌస్‌లో నివాసం ఉంటున్నాడు. గతేడాది డిసెంబర్‌లో క్రెడిట్ కార్డు కోసం ఓ జాతీయ బ్యాంక్‌కు చెందిన వెబ్‌సైట్‌ను తెరిచి అందులో వివరాలు నమోదు చేశాడు. పాత క్రెడిట్ కార్డు వివరాలను ఇవ్వగా అతని బ్యాంకు ఖాతానుంచి పలు దఫాలుగా రూ.3,17,438 నగదు డ్రా అయినట్లు ఫోన్‌కు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో నిర్ఘాంతపోయిన బాధితుడు వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు బాధితుడు బుధవారం దర్గామిట్ట పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. ఎస్సై జీవీ సుబ్బారావు కేసు నమోదు చేశారు.

బ్యారేజ్ వద్ద గుర్తుతెలియని మృతదేహం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పొదలకూరు: సంగం బ్యారేజ్ 50వ పిల్లర్ వద్ద గుర్తుతెలియని మృతదేహాన్ని బుధవారం పోలీసులు వెలికి తీయించారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. బ్యారేజ్ పిల్లర్ పక్కనే తేలియాడుతున్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే ఎస్సై ఎస్‌కే హనీఫ్ అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.47
సన్నవి : రూ.35
పండ్లు : రూ.22



తెలుగు తమ్ముడి బరితెగింపు

కూటమి ప్రభుత్వంలో తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోతున్నారు. ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నారు. భూ కబ్జాలకు పాల్పడుతున్నారు. ఓ నాయకుడు సీతారామపురం మండలంలో పంచాయతీ స్థలాన్ని ఆక్రమించాడు. దీనిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరుతున్నా యంత్రాంగం పట్టించుకోవడం లేదని విమర్శలున్నాయి.

- పంచాయతీ స్థలం ఆక్రమణ
- షాపు కోసం గది నిర్మాణం
- సర్పంచ్ ప్రశ్నించడంతో టీడీపీ కార్యాలయంగా మార్పు
- అధికారులకు ఫిర్యాదు



సంజీవరెడ్డి నగర్‌లో వాటర్ ట్యాంక్ ప్రహరీని తొలగించి నిర్మించిన గది

ఉదయగిరి: సీతారామపురం మండలం బసినేనిపల్లి పంచాయతీ సంజీవరెడ్డి నగర్‌లో 12 సంవత్సరాల క్రితం తాగునీటి అవసరాల కోసం 3.5 సెంట్ల గ్రామ కంఠం (సర్వే నంబర్ 127)లో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించారు. దాని చుట్టూ ప్రహరీ నిర్మాణం చేశారు. ఈ భూమి జాతీయ రహదారికి ఆనుకుని ఉంది. దీంతో విలువైనదిగా మారింది. సదరు భూమిపై టీడీపీ జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి తురక వెంకటేశ్వర్లు కన్నేసి కాజేసేందుకు ప్రణాళిక వేశారని ఆరోపణలున్నాయి. ఆ స్థలంలో వ్యాపార అవసరాల కోసం గదిని నిర్మించేందుకు ట్యాంక్‌కు రక్షణగా జాతీయ రహదారి వైపు ఉన్న ప్రహరీని తొలగించారు. గ్రామ సర్పంచ్ పల్లె విజయమ్మ అభ్యంతరం తెలిపినా అధికారాన్ని అడ్డం పెట్టుకుని లెక్క చేయలేదు. దళిత వర్గానికి చెందిన సర్పంచ్ కావడంతో ఆ నేత డోంట్ కేర్ అంటూ తన పని పూర్తి చేశారు.

చర్యలు తీసుకోవాలని కోరినా..

ఎంతో విలువైన పంచాయతీ స్థలంలో టీడీపీ నాయకుడు గది నిర్మించాడు. ఈ వ్యవహారంపై మాట్లాడితే ఎక్కడ అక్రమ కేసులు పెట్టి ఇబ్బంది పెడతారోననే భయంతో స్థానికులు మిన్నకుండిపోయారు. అయితే సర్పంచ్ ప్రభుత్వ భూమిని కాపాడాలనే సంకల్పంతో పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కానీ కార్యదర్శి పట్టించుకోలేదు. దీంతో సర్పంచ్ ఈఓపీఆర్డీ భార్గవితోపాటు ఎంపీడీఓ భాస్కర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆక్రమణదారుడు తాను ఆక్రమించి నిర్మించిన షాపునకు వెంటనే పచ్చ రంగు వేసి టీడీపీ కార్యాలయం అని పేరు రాయించాడు. వాస్తవానికి ఉదయగిరి నియోజకవర్గంలో మండల కేంద్రాల్లోనే పార్టీ కార్యాలయాలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడా ఏర్పాటు చేయలేదు. అధికారులు ఈ నిర్మాణం జోలికి రాకుండా ఉండేందుకు ముందస్తుగా పచ్చ రంగు వేసినట్లు ప్రచారం జరుగుతోంది. పంచాయతీ స్థలాన్ని తన సొంతం చేసుకునేందుకు తెలుగు తమ్ముడు పక్కా ప్లాన్ వేసినట్లు చెబుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



సంజీవరెడ్డి నగర్‌లో జాతీయ రహదారి పక్కన ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించిన పంచాయతీ స్థలాన్ని అధికార పార్టీకి చెందిన జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి తురక వెంకటేశ్వర్లు ఆక్రమించారు. అందులో వ్యాపార అవసరాల కోసం షాపు నిర్మించారు. అనంతరం పార్టీ రంగు వేసి పార్టీ కార్యాలయంగా మార్చారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేశాం. వెంటనే స్పందించి కట్టడాన్ని తొలగించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

– పల్లె విజయమ్మ, సర్పంచ్, బసినేనిపల్లి

నోటీసులిస్తాం



ఓవర్‌హెడ్ ట్యాంక్ ప్రహరీ ధ్వంసం చేసి పంచాయతీ స్థలం (గ్రామ కంఠం) ఆక్రమించి గది నిర్మించినట్లు సర్పంచ్ నా దృష్టికి తెచ్చారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసి ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటాం.

– భార్గవి, ఈఓపీఆర్డీ

భూముల క్రమబద్ధీకరణకు అవకాశం

• జేసీ కార్తీక్

నెల్లూరు రూరల్: అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు క్రమబద్ధీకరణ చేసుకోవడానికి ముందుకు రావాలని జేసీ కె.కార్తీక్ ఒక ప్రకటనలో కోరారు. 2019 అక్టోబర్ 10వ తేదీ కంటే ముందు నిరభ్యంతరకర భూముల్లో ఆర్‌సీసీ స్లాబుతో లేదా రేకులతో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న వారు రెగ్యులరైజ్ చేసుకోడానికి ఆధారాలతో మీ–సేవ, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. గుడిసెలు, తాటాకు పూరిళ్లకు ఇది వర్తించదన్నారు. 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తామని, రిజిస్ట్రేషన్ ఫీజు సైతం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. 151 నుంచి 300 గజాల్లోపు అయితే బేసిక్ ధరలో 15 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం చెల్లించాలన్నారు. లేఅవుట్లు, కాలువలు, నదీ ప్రవాహ గట్లు, మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్‌లో నిర్దేశిత స్థలాలు, జలవనరులకు సంబంధించిన వాటిల్లో క్రమబద్ధీకరణ చేయబోరన్నారు. అర్హత కలిగిన వారి జాబితాను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తారని, అభ్యంతరాలు స్వీకరించి తహసీల్దార్లు తుది జాబితాను సబ్ కలెక్టర్, ఆర్డీఓకు పంపిస్తారన్నారు. సబ్ డివిజనల్ లెవల్ అప్రూవల్ కమిటీ ప్రకటించిన అర్హుల జాబితాపై అభ్యంతరాలుంటే జేసీకి 30 రోజుల్లోగా అప్పీల్ చేసుకోవచ్చన్నారు. అర్హుల జాబితా ఖరారైన తర్వాత ఆ వివరాలను తహసీల్దార్లు ఆ ప్రాంత సబ్ రిజిస్ట్రార్లు, జిల్లా రిజిస్ట్రార్లకు పంపుతారని తెలియజేశారు.

పూరిల్లు దగ్ధమై.. కట్టుబట్టలతో మిగిలి..

- రూ.1.5 లక్షల నగదు, 5 సవర్ల బంగారం అగ్నికి ఆహుతి
- ఫైరింజిన్ మరమ్మతులకు గురైందన్న సిబ్బంది
- అదే ఇంట్లో రెండు నెలల క్రితం చోరీ



కాలి బూడిదైన పూరిల్లు

కావలి: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం పూరిల్లు దగ్ధమైంది. పట్టణానికి చెందిన గుంజి వెంకటేశ్వర్లు ఆటో డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. అతని భార్య కోటేశ్వరి ఇళ్లల్లో పని మనిషిగా చేస్తోంది. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గ్యాస్ సిలిండర్ పేలిపోవడంతో మంటలు ఎగసిపడ్డాయి. ఆటో కొనుగోలు చేయడానికి అప్పుగా తెచ్చుకున్న రూ.1.5 లక్షల నగదు, 5 సవర్ల బంగారం పూర్తిగా కాలిపోయాయి. ఇతర విలువైన వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. పూరిల్లు కాలిపోతోందని స్థానికులు అగ్నిమాపక శాఖ కార్యాలయానికి సమాచారమిచ్చారు. సిబ్బంది వచ్చి ఫైరింజన్ మరమ్మతులకు గురైందని చెప్పడంతో బాధితులు, స్థానికులు నివ్వెరపోయారు. కాగా రెండు నెలల క్రితం ఈ ఇంట్లో చోరీ జరిగింది. రూ.60,000 నగదు, 3 సవర్ల బంగారాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి న్యాయం కోసం తిరుగుతున్నారు. తాజాగా ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

• విద్యార్థి మృతి

సంగం: పెన్నానదిలో సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లిన ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయిన ఘటన మండలంలోని కోలగట్లలో బుధవారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. ఆత్మకూరుకు చెందిన గంగాధర్, ప్రసన్న దంపతుల రెండో కుమారుడు యశ్వంత్ (15) ప్రగతి స్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. మహాశివరాత్రి పండగ సందర్భంగా పాఠశాలకు సెలవు ప్రకటించారు. దీంతో ఆత్మకూరు నుంచి యశ్వంత్, మరో ఏడుగురు విద్యార్థులు సరదాగా ఈత కొట్టేందుకు కోలగట్లకు వచ్చారు. నాగార్పమ్మ గుడి సమీపంలోని పెన్నానదిలోకి యశ్వంత్, ఐదుగురు ఈతకు వెళ్లగా ఇద్దరు గట్టుపై కూర్చున్నారు. యశ్వంత్, మరొకరు సుమారు 500 మీటర్ల ముందుకు ఈదుతూ వెళ్లారు. ఒక్కసారిగా యశ్వంత్ నీటిలోకి మునిగిపోయాడు. అతడిని కాపాడేందుకు స్నేహితులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఒడ్డుకు చేరుకున్న వారు సెల్‌ఫోన్ ద్వారా తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. విద్యార్థులు ఆందోళన చెందుతుండటంతో గ్రామస్తులు సంగం ఎస్సై రాజేష్‌కు సమాచారం ఇచ్చి పెన్నానదిలో గాలింపు చేపట్టారు. యశ్వంత్‌ను బయటకు తీసి ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించడంతో మృతదేహాన్ని ఇంటికి తరలించారు. ఎస్సై తన సిబ్బందితో ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. యశ్వంత్ మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.



యశ్వంత్ (ఫైల్)



యశ్వంత్‌ను బయటకు తీసుకొచ్చిన యువకుడు

ట్రక్ ఆటోను ఢీకొన్న బైక్

• యువకుడి దుర్మరణం

బిట్రగుంట: బోగోలు మండలం ముంగమూరు గ్రామంలో బుధవారం ట్రక్ ఆటోను మోటార్‌బైక్ ఢీకొన్న ఘటనలో యాదగిరి శ్రీను (17) అనే యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికుల కథనం మేరకు.. కావలి రూరల్ మండలం గౌరవరం గిరిజన కాలనీకి చెందిన శ్రీను, గణేష్‌లు ముంగమూరు గ్రామంలో పొలంలో పురుగు మందులు పిచికారీ చేసే పని చేసి తిరిగి బైక్‌పై ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ముంగమూరు గ్రామంలో మినరల్ వాటర్ అమ్మకాలు చేసే ట్రక్ ఆటోను బైక్ ఢీకొట్టింది. దీంతో శ్రీను మరణించగా, గణేష్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.



శ్రీను మృతదేహం

డీవీసత్రంలో దొంగల హల్‌చల్



చోరీ చేసేందుకు రాడ్‌తో వస్తున్న గుర్తుతెలియని వ్యక్తి

దొరవారిసత్రం: మండలంలోని దొరవారిసత్రం పరిధిలోని జాతీయ రహదారి వెంబడి ఉన్న వివిధ దుకాణాల వద్ద దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. మంగళవారం రాత్రి ఎవరూ గుర్తుపట్టకుండా ఉండేందుకు తలకు టోపీ, ముఖం కనిపించకుండా రుమాలు, చేతికి గ్లౌజ్‌లు తొడుక్కున్న ఇద్దరు ఓ దుకాణంలో చోరీకి ప్రయత్నించారు. అక్కడ ఏర్పాటు చేసిన అలర్ట్ సైరన్ మోగడంతో దుండగులు మోటార్‌బైక్‌పై పరారయ్యారు. జాతీయ రహదారి వెంబడి ఉన్న పలువురి షాపుల్లో ఇటీవల వరుసగా చోరీలు జరుగుతున్నాయి. దీంతో యజమానులు భయాందోళన చెందుతున్నారు. మూడు రోజుల క్రితం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఒక వ్యక్తి బైక్‌ను చోరీ చేశారు. గతంలోనూ అనేక బైక్‌లను ఎత్తుకెళ్లారు. పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.




తీరంలో సందడి

ప్రముఖ పర్యాటక కేంద్రం మైపాడు తీరానికి భక్తులు పోటెత్తారు. బుధవారం శివరాత్రి సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించి తీరంలోని శివాలయాల్లో పూజలు జరిపారు. వేకువజాము నుంచి సాయంత్రం వరకు భక్తుల తాకిడి కొనసాగింది.

– ఇందుకూరుపేట

కండలేరులో 52.063 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 52.063 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 620, పిన్నేరు కాలువకు 120, లోలెవల్ కాలువకు 210, హైలెవల్ కాలువకు 210, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 86
లేయర్ (లైవ్)	: 75
బ్రాయిలర్ చికెన్	: 162
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 182
లేయర్ చికెన్	: 127

